క్లుప్తంగా

దొరబాబుకు సుధాకర్ కృతజ్ఞతలు



దవులూరి దొరబాబును కలిసిన వారా సుధాకర్

సామర్లకోట: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబును నియోజకవర్గ సోషల్ కన్వీనర్ వారా సుధాకర్ మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రెండోసారి తనపై నమ్మకం ఉంచి సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమించడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి పార్టీ కార్యకర్తలను చైతన్యం చేయడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నుంచి వస్తున్న ప్రతి సమాచారం కార్యకర్తలందరికీ తెలియజేస్తానని తెలిపారు.

జాతీయ రహదారి పనుల పరిశీలన



అచ్చంపేట ఏడీబీ రోడ్డులో జరుగుతున్న పనులను పరిశీలించిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

సామర్లకోట: కాకినాడ పోర్టు నుంచి సామర్లకోట మండలం అచ్చంపేటపేట, పెద్దాపురం ఏడీబీ రోడ్డు మీదుగా రాజమహేంద్రవరం వరకు నిర్మాణం అవుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులను ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాసు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తరువాత జాతీయ రహదారి పనుల వేగవంతంపై దృష్టి సారిస్తున్నామన్నారు. అచ్చంపేట నుంచి పెద్దాపురం ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్ వరకు ఫ్లైఓవర్ బ్రిడ్జితో జాతీయ రహదారి విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా పనులు చేయడం జరుగుతుందని చెప్పారు.

కల్యాణ మంటపం నిర్మాణానికి స్థలం పరిశీలన



ఉప్పాడలో కల్యాణ మంటపానికి స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించే కల్యాణ మంటపానికి మండలంలోని ఉప్పాడలో దేవదాయ శాఖకు సంబంధించిన స్థలాన్ని మంగళవారం కాకినాడ ఆర్డీఓ మల్లిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పాడలో దేవదాయ శాఖకు చెందిన సుమారు ఎకరం స్థలంలో కల్యాణ మండపం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసున్నట్టు, నిర్మాణానికి అవసరం అయిన భూ సేకరణ ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపించి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ చిన్నారావు, టీటీడీ ఏఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతూన్న యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ హెచ్ దాస్

కొత్తపల్లి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ హెచ్ దాస్ అన్నారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో మహిళ సాధికరతకు బ్యాంకులు ఏ విధంగా ఉపయోడపడతాయి అనే విషయంపై మంగళవారం సమావేశం నిర్వహించారు. చిన్న వ్యాపారంలో పెద్ద పెద్ద ఇండస్ట్రీయల్ లిస్టుగా ఎదగడానికి ఉండే అవకాశాన్ని సూచించారు. ఈ కార్యక్రమంలో గొల్లప్రోలు బ్యాంక్ మేనేజర్ నరసింహారాజు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ షాపులో అధికారుల దాడులు

కొత్తపల్లి: పిఠాపురం పట్టణంలోనిఆరుద్ర మొబైల్ షాపులో మంగళవారం సేల్స్ అధికారు లు దాడులు నిర్వహించారు. వారికి అందిన సమాచారం మేరకు అధివారులు దాడులు చేశారు. షాపులో బిల్లులు లేకుండా సెల్ ఫోన్లు విక్రయిస్తున్నట్టు, ఆధారాలు లేని ఫోన్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అయితే వివరాలు అడిగేందుకు వెళ్లిన విలేకరులపై షాపు సిబ్బంది దురుసుగా ప్రవర్తించారు. విలేకరులకు అధికారులు సమాచారాన్ని తెలియజేసేందుకు నిరాకరించారు.

ఏసు రాకకు సర్వం సిద్ధం

- విద్యుద్దీపాలతో చర్చిలకు అలంకరణలు
- క్రైస్తవుల ఇళ్ల వద్ద స్టార్లు
- వాడవాడలా పండగ వాతావరణం



విద్యుత్తు దీపాలతో అలరించిన ఆర్సీఎం చర్చి



తిరుపతిలో సుందరంగా తీర్చిదిద్దిన క్రీస్తుశాంతి ప్రార్థనా మందిరం



సామర్లకోటలో విద్యుత్తు దీపాలంకరణతో సెంటినరీ బాపిస్టు చర్చి

సామర్లకోట: క్రిస్మస్ వస్తోందంటే నెల రోజుల నుంచి సందడి ప్రారంభమవుతుంది. ఏసు ప్రభువు రాకను పురస్కరించుకుని ఈ నెలంతా విద్యుత్ దీపాలతో, ఇళ్ల ముందు స్టార్లతో ఇళ్ల ముంగిళ్లు కాంతులీనుతుంటాయి. ఈ సందర్భంగా మంగళవారం పిల్లలు క్రిస్మస్ తాత వేషధారణలో ఇంటింటికీ వెళ్లి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి బహుమతులు అందజేశారు.

పురాతన చర్చిలకు సరికొత్త శోభ

పట్టణ, మండల పరిధిలో చర్చిలను విద్యుద్దీపాలలో అలంకరించారు. పట్టణ పరిధిలో అతి పురాతనమైన బ్రిటిష్ కాలం నాటి చర్చిని సెంటినరీ అగస్థానా లూథరన్ చర్చిగా(సూది గుడి) పిలుస్తారు. అలాగే ఆంధ్రా బాప్టిస్టు చర్చి, సెంటినరీ బాప్టిస్టు చర్చి, షాలెమ్ బాప్టిస్టు చర్చి, ఆర్‌సీఎం చర్చిలతో పాటు మరో 75 చర్చిల వరకు పట్టణంలో ఉన్నాయి. మండల పరిధిలో మరో 50 వరకు చర్చిలు ఉన్నాయి. వాటన్నింటినీ విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. క్రిస్మస్ సందర్భంగా ఆదివారం ఉదయం నుంచి అన్ని చర్చిలలోను ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. ఆయా చర్చిల వద్ద అనేక మంది ఇళ్ల వద్ద క్రిస్మస్ చెట్లు ఏర్పాటు చేసి వాటికి విద్యుద్దీపాలంకరణలు చేశారు.

సిద్ధమైన చర్చిలు


పెద్దాపురం: క్రిస్మస్ ఆరాధనలకు పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో దేవాలయాలు సిద్ధమయ్యాయి. పట్టణంలోని స్థానిక లూథరన్, బైబిల్ మిషన్, తండ్రి, కుమార పరిశుద్ధాత్మ మినిస్ట్రీస్, క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరాలతో పాటు మండలంలోని దివిలి, తిరుపతి, చదలాడ, పులిమేరు, జి.రాగంపేట పలు గ్రామాల్లోని చర్చిల్లో భారీ లైటింగ్, క్రిస్మస్ ట్రీ, నక్షత్రాలతో అలంకరించారు. చర్చిల్లో లోపల క్లాత్ డెకరేషన్, రంగు రంగుల స్టిక్కర్లు, జెండాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రతి చర్చిలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రార్థనలు నిర్వహించేందుకు దైవజనులు ఏర్పాట్లు చేయగా క్రిస్మస్ వేడుకలకు చర్చిలు సిద్ధమయ్యాయి.

విరవలో నేడు వేడుక

పెద్దాపురం: మండలంలోని దివిలి క్రీస్తు శాంతి ప్రార్థన మందిరాల ఆధ్వర్యంలో నిర్వహించే క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఈ నెల 25న విరవ వైఎస్సార్ కాలనీలో క్రీస్తు శాంతి ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుక నిర్వహించనున్నట్టు మందిర నిర్వాహకులు నంగిన సత్యానందం తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఏటా నిర్వహించే క్రిస్మస్ వేడుకల్లో భాగంగా సాయంత్రం ఆరు గంటల ఆరాధన ప్రారంభమౌతుందన్నారు. ప్రముఖ దైవజనులు అరుణ్‌కుమార్ (రంగంపేట). సీజీఎం వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్ వర్తమానాన్ని అందిస్తారన్నారు.

కొత్తపల్లి: మండలంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు చర్చిలన్నీ ముస్తాబయ్యాయి. ఈ సందర్భంగా మంగళవారం ఉప్పాడ, కొత్తపల్లి, అమీనాబాద్, మూలపేట, పొన్నాడ, నాగులపల్లి తదితర గ్రామాల్లో ఆయా పాస్టర్ల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. చిన్నారులు వీధుల్లో నృత్యం చేస్తూ క్రీస్తు పుట్టికను వివరించారు. క్రిస్మస్ గీతాలు పాడారు. ఇవన్నీ అందిరినీ ఆకట్టుకున్నాయి.

పిఠాపురం మండలం జల్లూరులో ఉన్న బర్నింగ్ టూల్స్ మినిస్ట్రీస్ చర్చిలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు పాస్టర్లు ఎలీషా, జాన్ పాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ ప్రత్యేక వాక్యోపదేశం ప్రత్యేక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



అమరవల్లిలో విద్యుత్ దీపాలతో చర్చి



ఉప్పాడ చర్చిలో నృత్య ప్రదర్శలు చేస్తున్న చిన్నారులు



చదలాడ ఆలయంలో విద్యుత్ వెలుగల మధ్య క్రీస్తు ఏసు శిలువ, నక్షత్రం



చిన్నారుల నృత్య ప్రదర్శన

రాజేశ్వరి సేవలు మరువరానివి

మాజీ ఎంపీ వంగా గీత



దివంగత మాజీ మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరి విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వంగా గీత

పిఠాపురం: మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దేవరపల్లి రాజేశ్వరి పట్టణానికి చేసిన సేవలు మరువరానివని మాజీ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. స్థానిక రాజా రామ్మోహన్ రాయ్ పార్క్ వద్ద కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీసీ కార్యదర్శి మేడిది వెంకట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 15వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వంగా గీత మాట్లాడుతూ రాజేశ్వరి పిఠాపురం మున్సిపాలిటీకి ప్రథమ మహిళా చైర్మన్‌గా పని చేసి పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కాకినాడ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్లిపూడి రాంబాబు, పంతం నెహ్రూ, గండేపల్లి బాబి, వరినిడి సుజాత, గుణ్ణం మైదిలి, ఆగంటి ప్రభాకర్, రెడ్డెం జనార్దన్, తలింశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోరుబాటను జయప్రదం చేయాలి



సామర్లకోటలో పోరుబాట పోస్టర్లను ఆవిష్కరించిన దవులూరి దొరబాబు తదితరులు



పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వంగా గీత

నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్లు వంగా గీత, దొరబాబు పిలుపు

సామర్లకోట: ఎన్నికలల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం కాలరాసి ప్రజలపై మోపిన విద్యుత్ భారానికి నిరసనగా పోరుబాట నిర్వహిస్తునట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం ఈ మేరకు పోరుబాట పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రజల తరఫున ఈనెల 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమంలో భాగంగా సామర్లకోట విద్యుత్ సబ్ స్టేషన్ ఈఈ కార్యాలయం వద్ద పోరుబాట నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్ర మంలో విద్యుత్ వినియోగదారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నిరసనను తెలియజేయాలన్నారు. చంద్రబాబు నాయుడుకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం కొత్తేమీ కాదని ఆరోపించారు. ఎన్నికలల్లో ఇచ్చిన హామీలు అమలు చేయక పోగా ప్రజలపై విద్యుత్‌భారం వేయడం దారుణం అన్నారు. జగన్ మోహన్‌రెడ్డి గత ఎన్నికలలో హామీలు పూర్తిగా అమలు చేసి ఎన్నికలకు వచ్చారని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, కౌన్సిలర్ సేపెని సురేష్, పార్టీ రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, పట్టణ పార్టీ అధ్యక్షుడు పాగా సురేష్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు తలారి దొరబాబు, పెద్దాపురం మైనార్టీ అధ్యక్షుడు జానీ, డాక్టర్ వైఎస్సార్ యువసేన జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాసు, రైతు సంఘ నాయకుడు ఇంటి వెంకట్రావు, ఇరుసుమళ్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

27వ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా

పిఠాపురం: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు 27న పిఠాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేపట్టనున్నట్టు మాజీ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. స్థానిక రాజుగారి కోటలో ఉన్న పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం కరెంట్ చార్జీలు బాదుడుపై 'వైఎస్సార్ సీపీ పోరుబాట' పోస్టర్‌ను ఆవిష్కరించారు. నిర్వహించబోయే ఈ ధర్నాలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గండేపల్లి బాబి, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి

జేసీ రాహుల్ మీనా



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్ మీనా

కాకినాడ రూరల్: వినియోగదారుల హక్కుల పరిరక్షణకు అండగా ఉంటామని జాయింట్ కలెక్టరు రాహుల్ మీనా పేర్కొన్నారు. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వాకలపూడిలోని ప్యారీ షుగర్స్ రిఫైనరీ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం మైత్రేయి ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జేసీతో పాటు డీసీడీఆర్‌సీ ప్రెసిడెంట్ చెరుకూరి రఘుపతి వసంత కుమార్, సభ్యురాలు సీహెచ్ సుసి, తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వినియోగదారుల హక్కులు, వాటి పరిరక్షణ గురించి వారు అవగాహన కల్పించారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ ప్రభుత్వం పాత్రను జేసీ రాహుల్ మీనా తెలియజేసి, ఆన్‌లైన్‌లో కొనుగోలు ద్వారా వినియోగదారులు ఎక్కువగా మోసపోయే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో గంటా సత్యనారాయణ, చాగంటి నాగేశ్వరరావు తదితరులు వినియోగదారుల సక్సెస్ స్టోరీలను వివరించారు.

జేఎన్‌టీయూకేలో బుక్‌స్టాల్ స్వాధీనం

బాలాజీచెరువు: జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ఎదుట ఉన్న బుక్‌స్టాల్‌ను కళాశాల ఇంజినీరింగ్ సిబ్బంది మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గత రేండేళ్లుగా షాపును నిర్వహకుడు తీయకపోవడంతో పాటు నెలవారీ చెల్లించే అద్దెను చెల్లించక పోగా కళాశాల అధికారులకు ఏవిధమైన సమాచారం ఇవ్వకుండా గైర్హాజరయ్యాడు. దీంతో కళాశాల ఇంజినీరింగ్ అధికారి సన్నీ ప్రాన్సిస్ పోలీస్, రెవెన్యూశాఖ సమక్షంలో షాపు తెరచి అందులో ఉన్న పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి తొలగించి షాపును స్వాధీనం చేసుకున్నారు. దీనిని క్యాంటీన్‌కు కేటాయించినట్లు కళాశాల డీఆర్ శ్రీనివాస్ తెలిపారు.

ఘనంగా జాతీయ దంత వైద్యుల దినోత్సవం



దంతవైద్యులు అడ్డాల సత్యనారాయణ, సువర్ణరాజులను సత్కరించిన రత్నప్రసాద్ తదితరులు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ దంత వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రముఖ దంత వైద్యుడు, దేశంలో మొదటి దంత కళాశాల స్థాపించిన డాక్టర్ ఆర్. అహ్మద్ జయంతిని జాతీయ దంత వైద్యుల దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. 1948లో బెంగాల్ డెంటల్ సంఘాన్ని ప్రారంభించగా అది నేడు ఇండియన్ డెంటల్ సంఘంగా ఏర్పడిందని అన్నారు. ట్రస్టు నిర్వాహకులు అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో దంత వైద్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, డాక్టర్ సువర్ణ రాజులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేశ్వరరావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, చింతపల్లి సుబ్బారావు, ఎ.రామ్మూర్తి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పదింతల సంకల్పంతో..

- పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు
- పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు
- భయం పోగొట్టి ఉత్తమ ఫలితాలు సాధనే లక్ష్యం
- పిఠాపురం నియోజకవర్గంలో విద్యార్థుల సంఖ్య 3065



కొండెవరంలో స్టడీ అవర్‌లో చదువుతున్న విద్యార్థులను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు



కొండెవరంలో స్టడీ అవర్‌లో చదువుతున్న విద్యార్థు

కొత్తపల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల దగ్గర పడుతుండడంతో విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారు. ఈ ఒత్తిడిని తగ్గించి, భయాన్ని పాగొట్టి పదో తరగతి ఫలితాల్లో వందకు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యాశాఖ బలమైన సంకల్పంతో విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టారు. పాఠశాల అనంతరం స్టడీ అవర్స్ నిర్వహించి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయడమే కార్యక్రమంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో 3065 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు.

ఇష్టంగా చదివితే ఉత్తమ ఫలితాలు

పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పాఠాలను కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. ఏకాగ్రతతో చదువుతూ ఇతర వ్యాపకాలకు దూరంగా ఉండాలని చెబుతున్నారు. ప్రణాళిక ప్రకారం చదవడం ద్వారా మంచి మార్కులు సాధించడం కష్టమే కాదంటున్నారు. బట్టీ పట్టే విధానానికి స్వస్తి పలికి పాఠ్య పుస్తకాల్లో పాఠాలు చదివి పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచిస్తున్నారు. ప్రతి పాఠాన్ని విశ్లేషణగా చదివితే సులువుగా అర్థం అవడంతో పాటు కలకాలం గుర్తుండి పోతుందని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. ఒత్తిడికి గురై సమయం వృథా చేయకుండా పరీక్షలకు సిద్ధం అవ్వాలంటున్నారు. పరీక్షల సమయంలో మంచి ఆహారపానియాలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అవగాహనను కల్పిస్తున్నామంటున్నారు.

పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గంలో పది విద్యార్థులు పాఠశాలలు

1, కొత్తపల్లి	862	12
2, పిఠాపురం	1252	16
3, గొల్లప్రోలు	951	12

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. పరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు రివిజన్ చేయిస్తున్నారు. ఉన్న సమయంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. పాఠశాలకు రాని విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించే సమయంలో ఉపాధ్యాయులు స్నాక్స్‌ను అందిస్తున్నారు.

– బీకేవీ చక్రపాణి, ప్రధానోపాధ్యాయుడు కొండెవరం

పట్టుదలతో చదువుతున్నా



రోజూ వేకువ జామున 5గంటలకు లేచి పాఠ్యాంశాల వారీగా చదువుతున్నా. ఉపాధ్యాయులు సులభంగా అర్థమయ్యేలా బోధిస్తున్నారు. విద్యాశాఖ ఆదేశాలతో ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పదో తరగతి ఫలితాల్లో కచ్చితంగా వంద శాతం మార్కులు సాధించాలనే పట్టుదలతో చదువుతున్నా.

– మానుకొండ దీప్తి, పదో తరగతి కొండెవరం

మాపై ప్రత్యేక దృష్టి



ఉపాధ్యాయులు మాపై ప్రత్యేక దృష్టి పెట్టారు. నూర శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. పాఠ్యాంశాల వారీగా ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. పాఠ్యపుస్తకంలోని పాఠాలు విశ్లేణాత్మక పద్ధతిలో చదువుకుంటున్నాం. చదుతున్న పాఠాలను పుస్తకాలలో రాస్తూ సాధన చేస్తున్నాం. ఉపాధ్యాయుల సహాయాన్ని తీసుకుంటున్నాను. మా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మాపై ప్రత్యేకంగా పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేయను.

– ఎం.చైతన్య, పదో తరగతి కొండెవరం